

నకిలీ సర్టిఫికెట్లతో ప్లాట్ విక్రయం

బతికి ఉన్న మహిళను మృతి చెందినట్లు ధ్రువ పత్రాలు సృష్టించి ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసిన సంఘటన కుప్పంలో వెలుగులోకి వచ్చింది. - 8లో



హక్కులపై అవగాహన ముఖ్యం

రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను విద్యార్థిదశలోనే తెలుసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ అన్నారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	34	27
తిరుపతి	36	28
తిరుమల	30	23
గూడూరు	36	29
నగరి	36	28

న్యూస్‌రీల్

108 పైలెట్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు: 108 పైలెట్ ఉద్యోగాల ఖాళీల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ మోహన్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని విజయపురం, నింద్ర, తవణంపల్లె, కాణిపాకం, పులిచెర్ల, రొంపిచెర్ల, కుప్పం, గుడిపల్లి, రామకుప్పం, శాంతిపురంలో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పదోతరగతి పాసై, హెవీ డ్రైవింగ్ లైసెన్సు, లేదా బ్యాడ్జి కలిగి ఉండాలన్నారు. 35 ఏళ్లలోపు కలిగిన వారు తమ ధ్రువపత్రాలతో చిత్తూరు జిల్లా 108, 104 కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రేషన్ పంపిణీ మళ్లీ ఒకరోజు పొడిగింపు

చిత్తూరు రూరల్: రేషన్ పంపిణీని మళ్లీ ఒకరోజు పాటు పొడిగిస్తున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. ఈనెల ప్రారంభం నుంచి బుధవారం వరకు 85.18 శాతం పంపిణీ పూర్తయిందన్నారు. పంపిణీ శాతాన్ని పెంచేందుకు గురువారం కూడా రేషన్ పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. ఇంతవరకు రేషన్ తీసుకోని కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

టీకాల లక్ష్యం వందశాతం సాధించాలి

చిత్తూరు రూరల్: వ్యాధి నిరోధక టీకాల లక్ష్యం శతశాతం సాధించేలా వైద్య బృందం పనిచేయాలని డీఎండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో బుధవారం ఇంద్రధనస్సుపై వైద్య బృందానికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిర్దేశిత సమయానికి వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోని పిల్లలను గుర్తించాలన్నారు. ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో భాగంగా ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో గుర్తించిన పిల్లలకు టీకాలు వేయించాలన్నారు. కచ్చితంగా వంద శాతం టీకాల లక్ష్యం పూర్తి కావాలన్నారు. ఈ విషయంలో ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ల నిర్లక్ష్యం వీడాలన్నారు. బాధ్యతతో పనిచేసి, జిల్లాకు మంచి పేరు తీసుకోరావాలన్నారు. కార్యక్రమంపై జిల్లా అధికారులతో పాటు రాష్ట్ర అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఓ రవిరాజు, అధికారులు గుణశేఖర్, వెంకటప్రసాద్, జార్జి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల వారీగా 'హెచ్‌సీఎల్ టెక్‌బీ'

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని రెవెన్యూ డివిజన్ల వారీగా హెచ్‌సీఎల్ టెక్‌బీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 21వ తేదీన చిత్తూరు డివిజన్ పరిధిలో ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో, పలమనేరు డివిజన్‌లో మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్వ్యూలు, ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతాయన్నారు. అదే రోజు నగరి డివిజన్‌కు సంబంధించి పుత్తూరు పట్టణం నారాయణవనం రోడ్డులోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో, కుప్పం డివిజన్‌లో కుప్పం డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు, ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 85550 85030, 63630 95030 నంబర్లలో సంప్రదించాలన్నారు.

27న కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రానికి సమీపంలోని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 27వ తేదీన కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో రెవెన్యూశాఖలోని జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ సహాయకుల పోస్టుల భర్తీకి గ్రూప్ 4 పరీక్షను నిర్వహించారన్నారు. చిత్తూరు జిల్లాలోని పోస్టుల భర్తీకి మెయిన్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను ప్రాథమికంగా 1:3 నిష్పత్తిలో ఎంపిక చేశారన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను కలెక్టరేట్‌లోని నోటీస్ బోర్డులో పెట్టామని పేర్కొన్నారు. ఆ అభ్యర్థులకు ఈ నెల 27వ తేదీన కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ అభ్యర్థులందరికీ రిజిస్టర్ పోస్టు ద్వారా సమాచారం పంపినట్లు కలెక్టర్ వెల్లడించారు.

బదిలీలకు దరఖాస్తులు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎంఈఓ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది బదిలీలకు దరఖాస్తులు చేసుకోవాలని సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఆర్పీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు బదిలీలకు ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఎంఈఓ మెయిల్స్‌కు పంపామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను చిత్తూరు జిల్లా కేంద్రంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో గడువు తేదీలోపు అందజేయాలన్నారు.

భయం వీడండి.. అండగా ఉన్నాం

- ధైర్యం చెబుతూ, బాధలు తీరుస్తూ సాగిన పల్లెబాట
- జనంతో మంత్రి మమేకం



శివరామపురంలో ఎడ్ల బండిపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

శాంతిపురం: 'ఎవరికో భయపడి ఓట్లు వేయడం. వాళ్ల మాట వినకపోతే ఇబ్బందులు పెడతారనే ఆందోళన వద్దు. మీకు అండగా సీఎం, నేను, మన వాళ్లంతా ఉన్నాం..ధైర్యంగా ఉండండి.' అని రాష్ట్ర విద్యుత్, గనులు, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం ప్రజలకు భరోసా ఇచ్చారు. శాంతిపురం మండలంలో పల్లెబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మంత్రి 11 పంచాయతీల్లో పర్యటించారు. అన్ని చోట్లా స్థానిక ప్రజలతో మమేకం అవుతూ వారిలో ధైర్యం నింపారు. కుప్పంపై ప్రత్యేక దృష్టి సారించడంతో టీడీపీ నాయకుల దౌర్జన్యాలు ఇక సాగబోవని తేల్చి చెప్పారు. జనాన్ని భయభ్రాంతులకు గురిచేసే రాజకీయాలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మేలు జరిగి ఉంటేనే వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. బెదిరించి, అబద్ధాలు చెప్పి ఎన్నికల్లో గెలవడం తమ పార్టీ విధానం కాదని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా, 35 ఏళ్ల నుంచి వరుసగా ఇక్కడ శాసనసభ్యుడిగా గెలుస్తున్నా ప్రజల కష్టాలు పట్టించుకోక, కనీస వసతులు కల్పించక నిర్లక్ష్యం చేయటాన్ని ఎండగట్టారు. గ్రామాలకు కనీసం సరైన రోడ్డు సౌకర్యం కల్పించడంలోనూ బాబు వైఫల్యాన్ని ప్రశ్నించారు. పాలారు ప్రాజెక్టు నిర్మించకుండా తమిళనాడుతో కలిసి కుట్రపూరితంగా కేసులు వేయించిన బాబు తీరును ఎండగట్టారు. ప్రజల నుంచి సమస్యలపై పెద్ద ఎత్తున వస్తున్న అర్జీలను స్వీకరిస్తూ, వాటి పరిష్కారానికి ఎక్కడికక్కడ అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం 2019 ఎన్నికల ముందు చంద్రబాబు తెరమీదికి తెచ్చి, అర్ధాంతరంగా వదిలేసిన అంశాలపైనా దృష్టి సారించారు. హంద్రీనీవా కుప్పం కెనాల్‌ను త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. బలిజ భవన్ కోసం కుప్పంలో స్థలంతో పాటు నిధులను మంజూరు చేయించిన మంత్రి, తాజాగా కురబ కులస్తుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయించారు.

పవన్ కళ్యాణ్‌పై పోలీసులకు ఫిర్యాదు



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు

చిత్తూరు అర్బన్: పవన్‌కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖలపై చర్యలు తీసుకోవాలని వలంటీర్లు హరిహరన్, సద్దామ్, మోహమ్మద్, బెంజిమేన్‌లు చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం వలంటీర్లు వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సూర్య ప్రతాప్‌రెడ్డి, సుగుణశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డితో కలసి పోలీస్‌స్టేషన్‌కు ఈ మేరకు ఫిర్యాదును సీఐ విశ్వనాథరెడ్డికి అందజేశారు. అనంతరం వలంటీర్లు మాట్లాడుతూ తమకు కేటాయించిన ఇళ్ల పరిధిలో బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నామన్నారు. అయితే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖలు సరికాదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాలతి, కన్న, మొహిద్దీన్, వెంకట్, రమణారెడ్డి, ప్రసాద్, చిన్నబ్బ తదితరులు పాల్గొన్నారు.

పడమటి పట్టణాలకు అమృత్ 'జలం'

పట్టణవాసులకు కనీస వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్రం అమృత్ పథకం ప్రారంభించింది. ఈ పథకం కింద నిధులు మంజూరు చేస్తోంది. ఈ నిధుల వినియోగంలో తాగునీటి వసతి కల్పనకు తొలి ప్రాధాన్యం ఇస్తోంది. తాజాగా చిత్తూరు జిల్లాలోని పడమటి మున్సిపాలిటీలకు ఈ పథకం నిధులు మంజూరు కావడంతో ఆయా పట్టణాల్లో తాగునీటి వసతి కల్పనకు ప్రతిపాదనలు, అంచనాలు రూపొందించారు.

- ఒక్కొక్క మున్సిపాలిటీకి రూ.10.02 కోట్లు
- జగనన్న కాలనీలుసహా ఇంటింటికీ తాగునీరు
- ఫలించిన మంత్రి పెద్దిరెడ్డి కృషి

పుంగనూరు: జిల్లాలోని పడమటి మున్సిపాలిటీల్లో ప్రతి కుటుంబానికీ తాగునీటిని అందించడం కోసం అమృత్–2.0 పథకం కింద ఒక్కొక్క మున్సిపాలిటీకి రూ.10.02 కోట్లు మంజూరు అయ్యింది. దీంతో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి కృషి ఫలించినట్లయ్యింది. వివరాలిల్లోకి వెళితే.. జిల్లాలోని పడమటి ప్రాంతంలో ఉన్న పుంగనూరు, పలమనేరు, కుప్పం మున్సిపాలిటీల్లో ప్రజలకు తాగునీరు అందించాలని మంత్రి పెద్దిరెడ్డి సంకల్పించారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ విషయమై ఎంపీ మిథున్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి అటల్ మిషన్ ఫర్ రీజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్ మిషన్ (అమృత్–2.0)పథకం కింద పుంగనూరుకు రూ.10.02 కోట్లు, పలమనేరుకు రూ.10 కోట్లు, కుప్పం పట్టణానికి రూ.10.02 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో ఆ మూడు మున్సిపాలిటీల్లోని జగనన్న కాలనీల సహా ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా చేయనున్నారు. మున్సిపాలిటీల్లో ఇందుకు సంబంధించి ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్లు, కొళాయిలు, ఫిల్టర్ పాయింట్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు.



పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషాకు నివేదిక అందజేస్తున్న విశ్రాంత ఈఈ సత్యనారాయణ

పుంగనూరు మున్సిపాలిటీలో..

పుంగనూరులో అమృత్ పథకానికి సంబంధించిన అంచనాలను కన్సల్టెంట్ విశ్రాంత ఈఈ సత్యనారాయణ బుధవారం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషాకు అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాల మేరకు మంగళం కాలనీ వద్ద ఓవర్ హెడ్‌ట్యాంకు నిర్మిస్తున్నామన్నారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలకు మున్సిపాలిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ మహేష్, ఏఈ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

నీటి అవసరం గుర్తించాం



పడమటి ప్రాంతాల్లో నీటి అవసరం ఎంతో ఉంది. 30 ఏళ్లగా ఈ ప్రాంతంలో తాగునీటిని సరఫరా చేయడంలో పాలకులు నిర్లక్ష్యం చేశారు. వీటిని గమనించి ఈ ప్రాంతంలో కరువును పారదోలాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసమే మూడు ప్రాజెక్టులు, హంద్రీనీవా నీరు విడుదల, గండికోట నుంచి పైపులైన్ల ద్వారా నీటి సరఫరా పనులకు నిధులు మంజూరు చేశారు. ప్రజలకు సాగునీరు–తాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యం.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర మంత్రి

దుకాణాల్లో తనిఖీలు

- రెండు జిల్లాల్లో 23 కేసులు నమోదు
- దుకాణాలు మూసివేసిన వ్యాపారులు



చిత్తూరులోని తనిఖీలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ దివ్య

చిత్తూరు కార్పొరేషన్: తూనికలు కొలతలశాఖ అధికారులు బుధవారం పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు. అందులో భాగంగా చిత్తూరు, తిరుపతి జిల్లాలోని బియ్యం, వంటనూనె, రిటైల్ స్టోర్లలో సోదాలు చేశారు. అధికారులు తనిఖీలు చేస్తుండడంతో సమీప దుకాణాలను వ్యాపారులు మూసివేశారు. తిరుపతిలో 10, గూడురులో 7, చిత్తూరులో 6, పలమనేరులో 3 చొప్పున మొత్తం 23 కేసులు నమోదు చేసి, రూ.75 వేలు జరిమానా విధించినట్లు సహాయ కంట్రోలర్ స్వామి పేర్కొన్నారు. మరిన్ని కేసులు పరిశీలించి జరిమానా విధిస్తామని తెలిపారు. ఎక్కువగా బియ్యం, నూనె, వంట సరుకుల బరువు, ధరల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇందులో బియ్యం కేసులు 11, వంటనూనె 4, ఎమ్మార్పీకి సంబంధించి రెండు కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇన్‌స్పెక్టర్లు దివ్య, రమాదేవి, భరత్‌కుమార్, మల్లీశ్వరి పాల్గొన్నారు.

శాస్త్రోక్తం.. తిరుమంజనం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయం అయిన వరదరాజుల స్వామి ఆలయంలో ఆలయ అధికారులు తిరుమంజనం సేవను బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ అధికారులు వరదరాజుల స్వామి ఆలయ పరిసరాలను శుద్ధి చేసి, ఆలయంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం భక్తులకు వరదరాజ స్వామివారి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వరదరాజులస్వామి ఆలయాన్ని శుద్ధి చేస్తున్న ఆలయాధికారులు

దివ్యాంగులమని నిరుత్సాహపడకండి

- ఘనంగా సామాజిక సాధికారిత శిబిరం
- చిత్తూరు మేయర్, ఎమ్మెల్యే, కలెక్టర్ హాజరు
- 1,340 మంది దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ




ట్రైసైకిల్ పంపిణీ చేస్తున్న మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : దివ్యాంగులమని నిరుత్సాహపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలని నగర మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో విభిన్నప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో సామాజిక సాధికారిత శిబిరం నిర్వహించారు. గతంలో జిల్లా వ్యాప్తంగా శిబిరాలు నిర్వహించి, గుర్తించిన దివ్యాంగులకు ప్రస్తుతం వివిధ ఉపకరణాలను పంపిణీ చేశారు. నగర మేయర్ మాట్లాడుతూ దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సహకారం అందిస్తోందన్నారు. దివ్యాంగులకు ఉచితంగా ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు తదితర 22 రకాల ఉపకరణాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ కుల, మత, వర్గ రాజకీయ భేదాలు చూడకుండా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాష్ట్రప్రభుత్వం అందజేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల వారికి మేలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు.

దివ్యాంగుల ఆర్థికాభివృద్ధికి చేయూత

జిల్లాలోని దివ్యాంగుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూతనిస్తుందని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. జిల్లాలో 1,340 మంది దివ్యాంగులకు అవసరమైన ట్రైసైకిళ్లు, సెల్‌ఫోన్లు, వాకింగ్ స్టిక్‌లు, కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు తదితర మొత్తం 2,221 ఉపకరణాలను ఉచితంగా అందజేశామన్నారు. ఆ ఉపకరణాలు రూ.1.17 కోట్లు విలువ చేస్తాయని చెప్పారు. ప్రస్తుతం అందజేసిన వారికే కాకుండా అవసరమున్న వారికి బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లను అందజేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విభిన్నప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్, అలింకో రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో ఉపకరణాలు పొందిన దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. వారి ఆనందం వారి మాటల్లోనే..


ఎంతగానో ఉపయోగకరం



నేను తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్‌లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. నాకు రూ.15 వేలు పైచిలుకు విలువ చేసే మొబైల్ ఫోను ఉచితంగా ఇచ్చారు. నాకు పార్షల్ బ్లైండ్ ఉంది. మొబైల్‌లో పీడీఎఫ్ తెలుగు ఫార్మాట్‌ను అర్థం చేసుకునేందుకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఫోను నాకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– ఎస్.కేశవ, కదపల్లె, కుప్పం

వినికిడి సమస్య తీరింది



నాకు వినికిడి సమస్య ఉంది. ఆ సమస్యతో చాలా రోజులుగా ఇబ్బంది పడుతున్నాను. గతంలో నిర్వహించిన క్యాంపులో దరఖాస్తు చేసుకున్నాను. బుధవారం చిత్తూరులో నాకు వినికిడి యంత్రం అందజేయడం సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

– హెచ్.మహబూబ్, జెండామాను వీధి చిత్తూరు

'దారి' దోపిడీ

- ఓ ట్రావెల్స్ సంస్థ ఒకే పర్మిట్‌తో రెండు బస్సులను కొన్నేళ్లుగా నడుపుతోంది. గత నెలలో రవాణా శాఖాధికారులు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో ఈ విషయం వెలుగు చూసింది. పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు ఒక పర్మిట్‌తో రెండు బస్సులు నడుపుతున్నట్లు నిర్ధారించి, ఆ బస్సును సీజ్ చేశారు.
- ఓ బస్సుటాప్‌పై ఎలక్ట్రానిక్ పరికరాలు, వివిధ రకాల వస్తువులు సుమారు వంద కిలోలు వేసుకుని తిరుపతి నుంచి బెంగళూరు వైపుగా వెళుతుండగా రవాణాశాఖ అధికారులు ఆ బస్సును సీజ్ చేసి, దాని యజమానికి జరిమానా విధించారు. నిబంధనల మేరకు కాంటాక్ట్ క్యారియర్లలో లగేజీ తరలించడానికి వీలు లేదు.

- ఇష్టారాజ్యంగా తిరుగుతున్న ప్రైవేటు బస్సులు
- వాహన చట్టానికి తూట్లు
- ప్రత్యేక డ్రైవ్‌లో వెలుగు చూసిన అక్రమాలు



ప్రైవేట్ బస్సును తనిఖీ చేస్తున్న అధికారులు(ఫైల్)

చిత్తూరు రూరల్: ప్రైవేటు బస్సుల యజమానులు దారి దోపిడీకి పాల్పడుతున్నారు. వాహన చట్టాలకు తూట్లు పొడిచి, వాహనాలను నడుపుతూ అక్రమాలకు పాల్పడుతున్నారు. వీటిపై రవాణాశాఖ నిఘా పెంచి, కొరడా ఝళిపిస్తోంది. జిల్లాలో కాంటాక్ట్ క్యారియర్ వాహనాలు 328, స్టేజీ గ్యారేజీ వాహనాలు 104, టూరిస్ట్ ట్రావెల్స్ 37, ఇతర వాహనాలు 29 వరకు ఉన్నాయి. ఇవి జిల్లా కేంద్రం నుంచి తమిళనాడు, కర్ణాటక, కేరళ, నెల్లూరు, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్, అనంతపురం తదితర ప్రాంతాలకు తిరుగుతుంటాయి. ఈ సర్వీసులు అధికంగా రాత్రిపూటే తిరుగుతుంటాయి. ఈ క్రమంలో కొన్ని బస్సుల నిర్వాహకులు వాహన చట్టానికి తూట్లు పొడుస్తున్నారు.

భద్రత డొల్ల..

ప్రస్తుతం ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీలు స్లీపర్ కోచ్‌లను తీసుకువచ్చాయి. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. అయితే ఈ సీటింగ్ విధానంతో బస్సు లోపల స్థలం ఇరుకుగా మారింది. ఏదైనా ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రయాణికులు ఒకరిని దాటుకుని మరొకరు బయటకు వచ్చే పరిస్థితి ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లోనే మరణాల సంఖ్య పెరుగుతుంది. సాధారణంగా కాంటాక్టు క్యారియర్ అనుమతి ఉన్నవారు పెళ్లిళ్లు, శుభకార్యాలకు బస్సులను అద్దెకిస్తారు. దానికి విరుద్ధం స్టేజ్ క్యారియర్ అనుమతి లేకున్నప్పటికీ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బస్సును నడపడమే కాకుండా మధ్య మధ్యలో బస్సును ఆపి ప్రయాణికులను చేరవేస్తున్నారు.

లగేజీ పేరుతో దందా...

కాంటాక్టు క్యారియర్ అనుమతి తీసుకుని నిబంధనలు ఉల్లంఘిస్తూ స్టేజ్ క్యారియర్‌గా బస్సులను నడుపుతుండడమే కాకుండా ఈ ట్రావెల్స్ ఏజెన్సీ నిర్వాహకులు పార్శిల్, లగేజీ దందాను అక్రమంగా నిర్వహిస్తున్నారు. వస్తు సామగ్రిని ఒక చోట నుంచి మరోచోటుకు బస్సుల ద్వారా తరలించేందుకు అనుమతి లేకపోయినా యథేచ్ఛగా లగేజీ దందతా నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ప్యాసింజర్లను చేరవేయడం ద్వారా ట్రావెల్ ఏజెన్సీలకు అనుకున్న స్థాయిలో లాభాలు ఉండవని, పెద్ద మొత్తంలో లగేజీని బస్సుల బాక్స్‌లతోపాటు టాప్‌పై తీసుకొస్తుండడంతో ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఈ లగేజీ కారణంగా ప్రమాద తీవ్రత పెరుగుతుందని పలువురు భావిస్తున్నారు.

డిమాండ్ ఆధారంగా ధర

చిత్తూరు నుంచి బెంగళూరు, చెన్నై, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు వందలాది సర్వీసులు తిరుగుతున్నాయి. ఈ సర్వీసుల్లో గంట వ్యవధిలోనే ఆన్‌లైన్ బుకింగ్ ధరలు మారుతుంటాయి. డిమాండ్ పెరిగితే దానికి తగ్గట్టు టికెట్ ధర అమాంతంగా పెంచేస్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం నుంచి సోమవారం వరకు టికెట్ ధరలు మండిపోతుంటాయి. ప్రయాణికుల అవసరం ఆధారం కాసులు దండుకుంటున్నారు. పండుగ సమయాల్లో రెండింతలుగా టికెట్ వసూలు చేస్తున్నారు.

ప్రత్యేక డ్రైవ్...

ప్రైవేటు బస్సుల అక్రమాలను అరికట్టేందుకు రవాణాశాఖ అధికారులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టారు. ప్రత్యేక డ్రైవ్ పేరుతో తరచూ దాడులు చేస్తున్నారు. ఈ సమయంలో పన్ను చెల్లించని వాహనాలకు బ్రేకులు వేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి నడుపుతున్న వాహనాలకు జరిమానా విధిస్తున్నారు.

వాహన చట్టాలను అధిగమిస్తే...



ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపితే ఊరుకోం. ఎట్టి పరిస్థితుల్లోను అలాంటి వాహనాలు రోడ్లపైకి రాకూడదు. అది వాహన చట్టానికి విరుద్ధం. ముఖ్యంగా పన్ను ఎగవేతకు చూస్తున్నారు. పట్టుబడితే మాత్రం అలాంటి వాహనాలను వదిలి పెట్టే ప్రసక్తేలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పన్ను చెల్లించని వారితో పన్ను కట్టించేలా చూస్తున్నాం. ఇందుకు వాహన యజమానులు కూడా సహకరించాలి.

–నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

క్లుప్తంగా

వినాయకుని సేవలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి



సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామివారిని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రన్ దర్శించుకున్నారు. బుధవారం సాయంత్రం ఆయన స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయాధికారులు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆయనకు ఆశీర్వాద మండపంలో వేదపండితుల ఆశీర్వచనం పలికి, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు, జిల్లా కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షిరిడీ ఎక్స్‌ప్రెస్‌కు కుప్పంలో స్టాపింగ్

కుప్పం: చెన్నై నుంచి కుప్పం మీదుగా షిరిడీ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు కుప్పంలో ఆపేందుకు రైల్వే శాఖ నుంచి అనుమతులు వచ్చినట్లు సాయి మాత సేవాట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్ బాబు తెలిపారు. కొన్నిఏళ్లుగా షిరిడీ ఎస్స్‌ప్రెస్‌ను కుప్పంలో ఆపాలని ఈ ప్రాంత వాసులు కేంద్ర రైల్వేమంత్రి, జనరల్ మేనేజర్, డీఆర్ఎంలు, ఉన్నతస్థాయి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారన్నారు. చాలా కాలం తరువాత కుప్పం రైల్వేస్టేషన్‌లో షిరిడీ ఎక్స్ ప్రెస్ ఆపేందుకు అనుమతులు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఇందుకు కృషి చేసిన చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పల్లెకు మెరుగైన విద్యుత్

సమాజ శ్రేయస్సులో విద్యుత్ రంగం పాత్ర కీలకం. ఈ రంగం బలోపేతంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్‌ను అమలులోకి తీసుకురానుంది. మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, బలోపేతం.. సరఫరాలో నాణ్యత మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇది పూర్తి స్థాయిలో అమలైతే పల్లెలకు మెరుగైన విద్యుత్ అందనుంది. దీనిపై ప్రత్యేక కథనం

- వ్యవసాయానికి ప్రత్యేక ఫీడర్లు
- రూ.వెయ్యి కోట్లతో పనులు
- అన్ని గ్రామాలకు త్రీఫేజ్ సరఫరా
- పెరగనున్న పరిశ్రమలు

చిత్తూరు కార్పొరేషన్: మండల కేంద్రాల్లో మాత్రమే ఉండే త్రీఫేజ్‌స్ సరఫరాను ఇక ప్రతి పల్లెకు తీసుకురానున్నారు. దీంతో పరిశ్రమ స్థాపనకు మరింత పెరగనుంది. వీటితోపాటు వ్యవసాయ సర్వీసులకు ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేసి, వాటి ద్వారా నాణ్యమైన సరఫరా ఇవ్వనున్నారు. రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం(ఆర్‌డీఎస్ఎస్) కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ పథకాన్ని జిల్లాలో రూ.వెయ్యి కోట్లు వ్యయంతో పనులు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి జిల్లాలోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సిబ్బంది జియో ట్యాగింగ్ ద్వారా సర్వే పనులు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాలు, లైన్ల ఆధునికీకరణ

ప్రతి సబ్‌స్టేషన్‌లో 4–6 ఫీడర్లు ఉంటాయి. ఇందులో వ్యవసాయం, వీధి దీపాలు, వాటర్‌వర్క్స్, వాణిజ్యం ఇలా అన్నింటికీ విద్యుత్ సరఫరా అవుతోంది. మండల కేంద్రాల్లో త్రీఫేజ్ సరఫరా ఉండడంతో అక్కడ పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేసే పనుల్లో ఉండగా ఈ పనులు పూర్తయ్యాక లైన్ ఏర్పాటు పనులు చేయనున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి టెండర్లు పిలిచారు. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం వేసిన లైన్ల ద్వారా ప్రస్తుతం సరఫరా జరుగుతోంది. వాటిని ఆధునికీకరించడానికి ఈ పనులు చేపట్టనున్నారు. కొత్తగా లైన్ వేసి అవసరమైన ప్రాంతాల్లో కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయనున్నారు.



ఏర్పేడులో సర్వే చేస్తున్న ఈఈ వాసురెడ్డి

గ్రామాలకు త్రీఫేజ్

గ్రామాలకు ఇక త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం దాదాపు ప్రతి సబ్‌స్టేషన్ పరిధిలో 250కి పైగా వ్యవసాయ సర్వీసులుండగా 5 వేలకు పైగా గృహ, వాణిజ్య ఇతర సర్వీసులున్నాయి. 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి గ్రామాల్లో విద్యుత్ సరఫరా జరుగుతోంది. భవిష్యత్‌లో 100/63 కేవీ నుంచి సరఫరా కానుంది. ప్రతి పల్లెలో ఉన్న పాత ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి, వాటి స్థానంలో సామర్థ్యం ఎక్కువ ఉన్న వాటిని ఏర్పాటు చేయనున్నారు. దీంతో అక్కడ రైస్‌మిల్, గ్రానైట్ పరిశ్రమ, వెల్డింగ్‌షాపు, వర్క్‌షాప్ వంటి చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు పెరుగుతుంది. స్థానికంగా నేల ఉండేవారు పరిశ్రమల ఏర్పాటుకు ముందువస్తారు. సబ్‌స్టేషన్‌లో వ్యవసాయానికి ప్రత్యేకంగా ఫీడర్ ఏర్పాటు చేసి, సరఫరా ఇవ్వనున్నారు. అంటే వ్యవసాయానికి ఒక ఫీడర్, మిగిలిన సర్వీసులకు కలిపి ఒక ఫీడర్ చొప్పున వేరు చేయనున్నారు. పనులు పూర్తయితే నాణ్యమైన విద్యుత్‌ను జిల్లావ్యాప్తంగా సరఫరా చేయనున్నారు. వీటితో పాటు ట్రాన్స్‌ఫార్మర్, సబ్‌స్టేషన్, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలు, 200 యూనిట్లు దాటిన గృహాలకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనున్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఓవర్‌లోడ్ ఉండే ప్రాంతాల్లో కొత్త లైన్ వేయనున్నారు. వీటితో పాటు పవర్‌ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టనున్నారు.

కేటగిరి వారీగా సర్వీసులు	
గృహ సర్వీసులు	13,73,346
వాణిజ్యం	1,61,215
పరిశ్రమలు	21,175
ప్రభుత్వ సర్వీసులు	46,690
వ్యవసాయం	3,20,000
వీధిదీపాలు	17,000
ఆర్‌డబ్ల్యూఎస్	13,924
హెచ్‌టీ	1906
మొత్తం	19,55,256

విద్యుత్ సరఫరా సమాచారం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత జిల్లాలోని 3.20 లక్షల వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాకు కోసం రోజు రూ.4.5 కోట్లు ఖర్చు చేస్తున్నారు. జూన్–2023 వరకు రూ.4,987 కోట్లు ఖర్చు చేశారు. తిరుపతి, తిరుపతి రూరల్, పుత్తూరు, చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, మదనపల్లె, పీలేరు, పుంగనూరు వారీగా మొత్తం 8 డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 400 కేవీ సబ్‌స్టేషన్లు 3, 220 కేవీ 8, 132 కేవీ 30, 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 406 ఉన్నాయి. 1,68,157 ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. 3 ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 12,345, 3 ఫేజ్ కన్నా ఎక్కువ ఉన్నవి 1,34,237, సింగిల్ ఫేజ్ 21,582 ఉన్నాయి. 2022 ఏప్రిల్ నుంచి 2023 జూన్ వరకు 1471.65 మిలియన్ యూనిట్లు విద్యుత్‌ను వ్యవసాయానికి వినియోగించారు.

మరింత మెరుగైన సరఫరా



“ ఆర్‌డీఎస్ఎస్ ద్వారా మరింత మెరుగైన విద్యుత్ సరఫరా ఇవ్వొచ్చు. వ్యవసాయానికి సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేక ఫీడర్ ద్వారా సరఫరా ఇవ్వనున్నాం. అలాగే పల్లెలకు 100 కేవీ వరకు ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టి 3 ఫేజ్ సరఫరాను అందుబాటులో ఉంచుతాం. దీంతో పరిశ్రమల స్థాపన పెరుగుతుంది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో సర్వే పనులు జరుగుతోంది. టెండర్లను ఆహ్వానించం.

– కృష్ణారెడ్డి, ఎస్ఈ, ట్రాన్స్‌కో

టమాట పంటపై ఏనుగుల దాడి



సదుం: ధ్వంసమైన టమాట పంట

సదుం: మండలంలోని మొరవపల్లె పంచాయతీ గంటావారిపల్లెకు చెందిన సుబ్రమణ్యం టమాట పంటపై బుధవారం వేకువజామున ఏనుగుల గుంపు దాడి చేసినట్టు బాధితుడు తెలిపాడు. నాలుగు గుంటలలో ఉన్న పంటపై ఏనుగుల దాడితో సుమారు రూ.లక్ష వరకు నష్టం చేకూరినట్టు బాధితుడు వాపోయాడు.



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చౌడేపల్లి: పుంగనూరు మార్గంలోని పెద్దయల్లకుంట్ల వద్ద బొలేరో పికప్ వాహనాన్ని ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సదుం మండలం గాండ్లపల్లెకు చెందిన నాగరాజ కుమారుడు ఎం.భానుప్రకాష్(20) పుంగనూరు మార్కెట్ యార్డులో కూలీగా పనిచేస్తున్నాడు. బైక్‌పై స్వగ్రామానికి వెళుతుండగా బొలేరో పికప్ వాహనం కమ్మీలు, ఇనుప సామగ్రి లోడ్‌తో చౌడేపల్లె నుంచి పుంగనూరు వైపునకు వెళుతుండగా డోర్ బయటకు వచ్చిన యాంగిల్స్‌ను బైక్‌పై వెళుతున్న భాను ప్రకాష్ ఢీకొన్నాడు. ఈ ఘటనలో భానుప్రకాష్‌కు తల పగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్ఐ రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. ఒక్కగానొక్క ఒక కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల ఆర్తనాదాలు పలువురిని కలిచివేశాయి. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ (ఇన్‌సెట్) భాను ప్రకాష్ (ఫైల్)

వైఎస్సార్ సీపీ నేతపై టీడీపీ సర్పంచ్ దాడి



గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమాపతి

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం బట్టికండ్రిగ దళితవాడకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఉమాపతిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ సర్పంచ్ వెంకటేష్ అతని అనుచరులు మంగళవారం రాత్రి దాడి చేసి గాయపరిచారు. ఇంటి స్థల వివాదంపై రెండు రోజులుగా ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 9.40 గంటలకు ఇంట్లో నిద్రిస్తున్న ఉమాపతిని లేపి, దాడి చేశారు. గాయపడిన ఉమాపతి పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స తీసుకొన్నాడు. ఈ మేరకు సర్పంచ్ వెంకటేష్, అదే గ్రామానికి చెందిన అతని అనుచరులు సాయి, ధనుంజయులు, మాతయ్య, దొరస్వామి, నాగయ్యతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన మరో ఐదుగురు కత్తితో తనపై దాడి చేసినట్లు ఉమాపతి వడమాలపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



భారతి మృతదేహం



ఇమ్రాన్ మృతదేహం

పలమనేరు: మండలంలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందినట్టు ఎస్ఐ సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. పట్టణంలోని కేవీఎస్ స్ట్రీట్‌కు చెందిన సుధాకర్ భార్య భారతి(48) బాత్‌రూమ్‌లో వాటర్‌హీటర్ ఆఫ్ చేసే క్రమంలో కరెంట్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి చేరుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. అలాగే మండలంలోని పలమనేరు– గుడియాత్తం రోడ్డులో ముసలిమొడుగు దర్గా వద్ద అడవిపందుల గుంపు అడ్డురావడంతో బైక్‌పై వెళుతున్న పుంగనూరుకు చెందిన ఇమ్రాన్(46) అదుపుతప్పి పడి, అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనలపై స్థానిక పోలీసులు విచారిస్తున్నారు.

మొగిలి ఘాట్‌లో మళ్లీ ఏనుగుల హల్‌చల్

పలమనేరు: చెన్నై– బెంగళూరు హైవేలోని మొగిలి ఘాట్ వద్ద ఏనుగులు రోడ్డుపైకి రావడంతో వాహనచోదకులు ఆందోళనకు గురైన సంఘటన బుధవారం రాత్రి జగమర్ల మలుపు వద్ద చోటు చేసుకుంది. ఇటీవలే ఇక్కడ మూడు ఏనుగులను టమాట లారీ ఢీకొని అవి మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదిలాఉండగా మళ్లీ ఏనుగులు ఇదే ప్రాంతంలో రోడ్డుపైకి రావడంతో హైవేలో వచ్చి వెళ్లే వాహనచోదకులు భయపడుతున్నారు. మళ్లీ ఏనుగులకు ఏదైనా ప్రమాదం జరుగకుండా స్థానిక ఎలిఫెంట్ ట్రాకర్లు మొగిలి ఘాట్‌లో రూట్ వాచ్ చేస్తున్నారు. అయినప్పటికీ ఏనుగులు తరచూ హైవేలోకి రావడంతో వీటిని ఎలా అదుపు చేయాలన్న విషయం స్థానిక ఫారెస్ట్ అధికారులకు అంతుబట్టడం లేదు. ఏది ఏమైనా ఈ మార్గంలో సాయంత్రం ఏడు నుంచి రాత్రి వేళలో ప్రయాణించే వాహనచోదకులు నెమ్మదిగా ముందు చూసి వెళ్లాలని ఎఫ్ఎస్వో సుకుమార్ చెబుతున్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో ప్లాట్ విక్రయం

- కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన
- మరణించినట్లు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి రియల్ దందా

కుప్పం : బతికి ఉన్న మహిళను మృతి చెందినట్లు మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసి, ఘరానా మోసానికి పాల్పడిన సంఘటన కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు ఈ విషయం తెలుసుకుని అధికారులను నిలదీయండంతో అసలు విషయం బయటపడింది. బాధితులు కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం అంబూరు ప్రాంతానికి చెందిన కాంచన రవివర్మ అనే మహిళకు గుడుపల్లె మండలం నలంగంపల్లె రెవెన్యూ గ్రామంలో సర్వే నంబర్ 11–2లో ప్లాట్ ఉంది. ఈ ప్లాట్‌ను గత ఏడాది అక్టోబర్‌లో కుప్పం పట్టణం గాంధీనగర్‌లో నివసిస్తున్న గౌస్‌బాషాకు రవివర్మ అనే రవి పెరియార్ విక్రయిస్తున్నట్లు డాక్యుమెంట్ సిద్ధం చేసి, రిజిస్ట్రేషన్ చేశారు. కాగా కాంచన రవివర్మ మృతి చెందినట్లు గుడియాత్తం మున్సిపాలిటీలో నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి, రిజిస్ట్రేషన్ చేసినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. కాంచన భర్త రవి వర్మ (44) కరోనా వ్యాధితో 2021 మృతి చెందాడు. 60 ఏళ్ల వయస్సు ఉన్న రవి పెరుమార్ పేరుగల వ్యక్తి తీసుకుని వచ్చి తన భార్య చనిపోయిందని, తనకు వారసత్వంగా వచ్చిన ఆస్తిని విక్రయిస్తున్నట్లు డాక్యుమెంట్ తయారు చేశారు. దీనికి తోడుగా తప్పుడు సర్టిఫికెట్లు తయారు చేసి, రిజిస్ట్రేషన్ చేశారు. విషయం తెలుసుకున్న కాంచన సబ్ రిజిస్ట్రేషన్ అధికారులు సంప్రదించగా అసలు విషయం బయటకు వచ్చింది.



కాంచన మృతి చెందినట్లు తమిళనాడు అధికారులు ఇచ్చిన డెత్ సర్టిఫికెట్

చేతులు మారిన రూ.లక్షలు

కుప్పం– పలమనేరు జాతీయ రహదారి పీఈఎస్ మెడికల్ కళాశాల సమీపంలోని ఉన్న విలువైన ప్లాట్ కావడంతో రిజిస్ట్రేషన్ కోసం రూ.లక్ష లు చేతులు మారినట్లు సమాచారం. ఇక్కడ పనిచేసే డాక్యుమెంట్ రైటర్లు, సాక్షులు, సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయ సిబ్బందికి రూ.లక్షలు ముట్టజెప్పినట్లు సమాచారం. అసలు విషయం బయటకు రావడంతో ఈ విషయం గుట్టు చప్పుడు కాకుండా చేయాలని కొందరు అధికారులు, మధ్యవర్తులు లక్షలాది రూపాయలు బేరసారాలు సాగించారు. కానీ బాధితులు సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌ను ప్రశ్నింస్తుండగా ఆయన సమాధానం ఇవ్వలేదు. విలేకరుల వివరణ కోసం సంప్రదిస్తే మాట్లాండేందుకు నిరాకరించారు.

భార్యాభర్త అదృశ్యం



అదృశ్యమైన దంపతులు

శ్రీరంగరాజపురం: భార్యాభర్త అదృశ్యం అయిన సంఘటన మండలంలోని గంగమ్మగుడి గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ షేక్షావలి కథనం మేరకు.. మండలంలోని గంగమ్మగుడి గ్రామంలో ఆంజనేయులు నాయుడు(58), ఆయన సతీమణి చిన్నపాపమ్మ (50) నివాసమున్నారు. వీరికి పిల్లలు లేకపోవడంతో తన అన్న కోడుకును పెంచుకున్నారు. ఇటీవల తమ పెంపుడు కుమారుడు విద్యుత్ షాక్‌తో మరణించారు. దీంతో మనస్తాపం చెందిన ఆంజనేయులునాయుడు ఆయన సతీమణి ఈనెల 15వ తేదీ నుంచి కనిపించలేదు. దీంతో ఆయన బంధువులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజలను నమ్ముకున్న నేత సీఎం జగనన్న

వెంకటగిరి: ప్రజలు, దేవుడిని నమ్ముకున్న నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు నాయుడు తనకు ఓటు వేసిన వారికి మాత్రమే న్యాయం చేస్తానని చెప్పారని, అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే పార్టీలు, కులాలు, మతాలకతీతంగా పేదరికమే అర్హతగా నవరత్నాల పథకాలు అందిస్తున్నారని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పెరుగుతున్న ప్రజాదరణను ఓర్వలేక ప్రభుత్వంపై ఎల్లోమీడియాతో కలిసి చంద్రబాబు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు.

పవన్ రాజకీయాల్లోకి ఎందుకు వచ్చారో..

కనీస అవగాహన లేని పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి ఎందుకు వచ్చారో అర్థం కావడం లేదని నారాయణస్వామి అన్నారు. తన జోలికివస్తే చెప్పుతో కొడతాననడం.. వలంటీర్ వ్యవస్థపై అభ్యంతకర విమర్శలు చేయడం ఏమటని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, సీనియర్ నాయకుడు మాదాసు గంగాధరం, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ, దొంతుశారద తదితరులు ప్రసంగించారు.

ఉరేసుకుని గుర్తు తెలియని వృద్ధుడి మృతి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ ఆంజనేయపురం ఫారెస్ట్ చెక్‌పోస్ట్ సమీపంలో ఓ చెట్టుకు వేలాడుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని బుధవారం పోలీసులు గుర్తించారు. మృతుడు సుమారు 60 ఏళ్ల వయస్సు కలిగి ఉంటాడు. తెల్లచొక్కా ధరించి ఉన్నాడు. మృతుడు ఎవరనేది తెలియరాలేదన్నారు. కేసు నమోదు దర్యాప్తులో ఉంది.

హక్కులపై అవగాహన ముఖ్యం

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులకు హక్కులపై అవగాహన ముఖ్యమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ అన్నారు. బుధవారం నగరంలోని సంజయ్‌గాంధీ నగర్‌లో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను విద్యార్థిదశలోనే తెలుసుకోవాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు అందుతున్నాయా? లేదా, చదువులో రాణిస్తున్నారా? లేదా అన్న అంశాలపై అధికారులు పరిశీలించాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులున్నట్‌లెతై అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రతి వసతి గృహంలో, గురుకుల పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయం నంబర్‌ను నోటీస్ బోర్డులో నమోదు చేయాలన్నారు. సమస్యలున్నట్‌లెతై 08572–231688 నంబర్‌కు విద్యార్థులు తెలియజేయాలని తెలిపారు. జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు 115 ఉన్నాయన్నారు. అందులో సుమారు 12 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించామన్నారు. బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానిబాషా, ఏఎస్‌డబ్ల్యూఓ నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ రేఖ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన పద్మావతి

- 2.30 గంటలు ఆలస్యంగా రైళ్ల రాకపోకలు
- అవస్థలు పడిన ప్రయాణికులు

తిరుపతి అర్బన్: తిరుపతిలో బుధవారం మధ్యాహ్నం రైల్వేస్టేషన్ యార్డ్ నుంచి వస్తున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. దీంతో గంటపాటు పలు రైలు రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో ప్రయాణికులు ఇక్కట్లు పట్టారు. ఉదయం 11.30గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నాలుగు గంటల పాటు శ్రమించి రైల్వే అధికారులు లైన్ క్లియర్ చేశారు. ఈ క్రమంలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌కు 2.30 గంటలపాటు ఆలస్యంగా నడిచాయి. సాధారణంగా రాయలసీమ ఎక్స్‌ప్రెస్(12793) తిరుపతి టూ నిజామాబాద్‌కు తిరుపతి నుంచి సాయంత్రం 5.30 గంటల సమయంలో వెళ్లాల్సి ఉంది. రాత్రి 8గంటలకు ఇది బయలుదేరింది. పద్మావతి ఎక్స్‌ప్రెస్(12763) తిరుపతి నుంచి సాయంత్రం 4.55 గంటలకు వెళ్లాల్సి ఉండగా, అయితే రాత్రి 7.45 గంటలకు బయలుదేరింది. ముందే తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు జోరుగా జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు వెయిటింగ్‌కు అవసరమైన సౌకర్యాలు లేకపోవడంతో నానా ఇక్కట్లు పడ్డారు. దానికితోడు గంటల కొద్ది ఆలస్యం కావడంతో నానా అవస్థలు ఎదుర్కొన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్ మేనేజర్ చిన్న రెడ్డెప్ప దీనిపై వివరణ ఇస్తూ యార్డ్ నుంచి వస్తున్న పద్మావతీ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిందని చెప్పారు. వెంటనే ఉద్యోగులు సమస్యను పరిష్కరించారని వెల్లడించారు. కొంత మేరకు రైళ్ల రాకపోకల్లో ఆలస్యం తప్పలేదని వెల్లడించారు. మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.



రైల్వే స్టేషన్‌లో రైలు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు